క్లుప్తంగా

భక్తులతో కిటకిటలాడిన మద్ది అంజన్న క్షేత్రం



మద్ది క్షేత్రంలో భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయ స్వామి వారిని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు వేదాంతం వెంకటాచార్యులు స్వామివారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆదాయం రూ:1,55,746 వచ్చినట్లు, 1,000 మంది స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారని ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి



ప్లాస్టిక్ నిర్మూలనపై సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించాలని జంగారెడ్డిగూడెం సొసైటీ అధ్యక్షుడు వందనపు వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో మంగళవారం ఆశ వర్కర్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రధాన ప్రాంతాల్లో మంచినీరు తాగేందుకు ప్లాస్టిక్ గ్లాసులు వినియోగిస్తున్నారని, దీనికి బదులుగా స్టీల్ గ్లాసులు వినియోగించాలని కోరారు. కాగా ఆశ వర్కర్‌లు క్షేత్రస్థాయిలో పర్యటించేటప్పుడు ప్రజలకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ చైతన్యపరచాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి బీవీ రత్నాజీ, సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన రోటరీ నృత్య పోటీలు



నృత్య ప్రదర్శనలు నిర్వహించిన చిన్నారులను అభినందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : రోటరీ యువజనోత్సవాల్లో భాగంగా మంగళవారం నృత్యపోటీలు నిర్వహించారు. స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్‌లో రోటరీ కార్యదర్శి ఉడా రాంగోపాల్ ఆధ్వర్యంలో తడికమళ్ల నవీన్ పర్యవేక్షణలో శాస్త్రీయ, ఆధునిక నృత్యపోటీలు నిర్వహించారు. ఏపీ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ఆర్ కృష్ణబాబు, మయూరా నాట్యాలయ వ్యవస్థాపకులు కె.ప్రశాంత కుమార్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. చిన్నారులు నిర్వహించిన నృత్యప్రదర్శనలు అలరించాయి. కొమ్ముకూరి నాగేశ్వరరావు, రోటరీ ప్రెసిడెంట్ ఎలక్ట్ రొంగల దేవీ ప్రసాద్, ధనకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తే పార్టీలో తగిన గుర్తింపు



ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సొంగా సందీప్

జంగారెడ్డిగూడెం : కష్టపడి పనిచేసే వారికి పార్టీలో ఎల్లప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. ఆంధ్రప్రదేశ్ లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన సొంగా సందీప్ మంగళవారం ఎమ్మెల్యే ఎలీజాను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయనకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సొంగా సందీప్‌కు పదవి రావడం, పార్టీలో ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందనడానికి మరో నిదర్శనం అన్నారు. కష్టపడి పనిచేసి పార్టీ అభివృద్ధి కృషి చేసిన వారికి ఏ స్థాయిలోనైనా పార్టీ తగిన గుర్తింపును అందిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా పార్టీ విజయానికి కృషిచేయాలని సందీప్‌కు సూచించారు.

వ్యక్తికి గాయాలు

జంగారెడ్డిగూడెం : రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెం గ్రామానికి చెందిన బండారు రామకృష్ణ తాపీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం తాపీ పనికి వెళుతూ పట్టణంలోని బైపాస్ రోడ్డు దాటుతుండగా, చిన్నంవారిగూడెం గ్రామం నుంచి వస్తున్న కారు ఢీకొంది. దీంతో గాయాలపాలైన అతడ్ని స్థానికులు ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

కొయ్యలగూడెం : వలంటీర్ల సేవలు అభినందనీయమని శాసనసభా పక్ష ఎస్సీ కమిటీ చైర్మన్, పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కేఆర్ఎస్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో రోటరీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో బాలరాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు ఐదున్నర లక్షల కోట్ల రూపాయలను ప్రజా సంక్షేమ పథకాల రూపంలో తమ చేతుల మీదుగా ప్రజలకు అందచేసే భాగ్యం వలంటీర్లకు దక్కిందని అన్నారు. చంద్రబాబు ఏ నోటితో అయితే వలంటీర్ల వ్యవస్థ అనవసరం అన్నాడో అదే నోటితో వలంటీర్లను కొనసాగిస్తాం అంటూ అనేటట్లు చేసిన ఘనుడు జగనన్న అని అన్నారు. ఇళ్ల నిర్మాణ నిమిత్తం పేదలకు ఇస్తున్న భూమిని శ్మశాన భూమిగా పేర్కొన్న చంద్రబాబుకు ప్రజలు వచ్చే సార్వత్రిక ఎన్నికలలో రాజకీయ సమాధి కట్టబోతున్నారన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి సిస్టమ్‌ని హ్యాక్ చేయడం హైటెక్ సీఎంగా ప్రచారం చేసుకునే చంద్రబాబుకు అలవాటేనని కాబట్టే అన్ని ప్రాంతాల అభివృద్ధికి మోకాలొడ్డుతూ కేవలం తన సామాజిక వర్గానికి అనుకూలమైన అమరావతిని రాజధానిగా చంద్రబాబు కోరుకుంటున్నారన్నారు. జ్ఞానం లేని పుత్రుడు ఒకవైపు, అజ్ఞానంతో మాట్లాడే దత్తపుత్రుడు మరోవైపు మాట్లాడుతున్న మాటలను ప్రజలు యావగించుకుంటున్నారన్నారు. వీరికి తోడు ఎల్లో మీడియా రాతలు రోతలుగా మారాయని ప్రజల చేత వాతలు పెట్టించుకునే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా సేవారత్న అవార్డుకు ఎంపికైన వలంటీర్లు కె.దేవిఫణి మోహన్ (కొయ్యలగూడెం), అస్మత్ తారా సయ్యద్ (బయ్యనగూడెం), బల్లే శ్రీనుబాబు (రాజవరం), దండి మోతి (యర్రం పేట), ఏసూరి ధనలక్ష్మి (మంగపతిదేవిపేట)లకు మెడల్స్, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో ఎం.రాజు, తహసీల్దార్ పాసం నాగమణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, ఎంపీపీ గంజిమాల రామారావు, వైస్ ఎంపీపీలు తుమ్మలపల్లి గంగరాజు, మట్టా వనజాలక్ష్మి, సచివాలయాల మండల కోఆర్డినేటర్ నూకల రాము, పట్టణ కన్వీనర్ శంకు కొండ, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, సర్పంచులు ఎంపీటీసీలు వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు పాల్గొన్నారు.



కొయ్యలగూడెంలో సేవా రత్న పురస్కార వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, ప్రజాప్రతినిధులు



జంగారెడ్డిగూడెంలో వలంటీర్లను సత్కరించిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు

జంగారెడ్డిగూడెం : రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్ల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల ఇంటి వద్దకే అందిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. మంగళవారం స్థానిక రాజా రాణి కళ్యాణ మండపంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున వలంటీర్లకు వందనం కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు అన్ని రకాల సేవలు అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజల మన్ననలు పొందుతున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నారు. వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారథులని అన్నారు. కరోనా కష్టకాలంలో వలంటీర్‌లు చేసిన సేవలు అమూల్యమైనవన్నారు. తనతో పాటు వలంటీర్లంతా జగనన్న సైనికులమని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వలంటీర్లను ఎమ్మెల్యే ఎలీజా సత్కరించారు. సేవా వజ్ర, పురస్కారాన్ని జంగారెడ్డిగూడెం సచివాలయం–8లో సేవలు అందిస్తున్న వలంటీర్ మహ్మద్ షరీఫ్, సేవా రత్న పురస్కారాన్ని రాజుల కాలనీ సచివాలయం వి.లక్ష్మీదుర్గ, గౌరీశంకరపురం సచివాలయం కె.సుజాత, డాంగేనగర్ సచివాలయం డి.సుజాత, హరిజనపేట–2 సచివాలయం కె.నాగజ్యోతి, అశ్వారావుపేటరోడ్–2 సచివాలయం బి.ఎం.నాగలక్ష్మి అందుకున్నారు. అలాగే సేవా మిత్రల కింద 182 మందిని అవార్డులతో ఘనంగా సత్కరించి, సర్టిఫికెట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్‌లు ముప్పిడి వీరాంజనేయులు (అంజి), కంచర్ల వాసవీ రత్నం, కమిషనర్ పి.భవానీ ప్రసాద్, ఉభయగోదావరి జిల్లాల బూత్ కమిటీల రీజనల్ కోఆర్డినేటర్ బీవీఆర్ చౌదరి, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పీపీఎస్ చంద్రరావు, ఏలూరు జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అక్బర్, బత్తిన చిన్న, కౌన్సిలర్‌లు, నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారు

బుట్టాయగూడెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సెంటు భూమి కేటాయించి అద్భుతమైన ఇళ్లు నిర్మించి ఇస్తూ ఉంటే ఆ స్థలాలను సమాధులతో పోల్చడం చంద్రబాబు అహంకారానికి పరాకాష్ట అని, వచ్చే ఎన్నికల్లో ప్రజలే అతనికి తగిన బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద వలంటీర్ల వందనం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని బాలరాజు అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడానికి ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తున్న వలంటీర్లు నిజమైన ప్రజాసేవకులని బాలరాజు కొనియాడారు. ఉత్తమ సేవలు అందిస్తున్న వలంటీర్‌లను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం వారికి అవార్డులు అందజేయడంతో వారి బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని వలంటీర్లను కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, ఎంపీడీఓ ఎం.శ్రీహరి, తహసీల్దార్ ఎస్.శారాశాంతి, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



బుట్టాయగూడెంలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

ఫొటో ఫ్రేమ్‌లు తయారుచేసిన విద్యార్థులు



కొయ్యలగూడెం శాఖా గ్రంథాలయంలో ఫొటో ఫ్రేమ్‌లు తయారు చేసిన విద్యార్థులు

కొయ్యలగూడెం : స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులు మంగళవారానికి 16వ రోజుకు చేరాయి. లైబ్రేరియన్ యు రాముడు పర్యవేక్షణలో వివిధ కళలకు సంబంధించి ఉపాధ్యాయులు, కళాకారులు ఇస్తున్న శిక్షణ శిబిరంలో 20 నుంచి 30 మంది వరకు విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులలో స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా కలర్ పేపర్స్‌తో ఫొటో ఫ్రేమ్ తయారీ విధానం నేర్పించారు. ఫొటో ఫ్రేములను తయారు చేసిన విద్యార్థులు దేశ నాయకుల చిత్రపటాలను అందులో ఏర్పాటు చేసి లైబ్రరీలో ప్రదర్శన నిమిత్తం ఉంచారు. ప్రతిరోజు వందేమాతర గీతాలాపనతో ప్రారంభమై జనగణమన కార్యక్రమంతో ముగిస్తూ విద్యార్థులు దేశభక్తిని చాటడం విజ్ఞాన తరగతులలో పాల్గొంటున్న ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మేకల అన్నవరం పేర్కొన్నారు.

పారదర్శక పాలనే జగనన్న లక్ష్యం

- ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా
- జంగారెడ్డిగూడెం 7వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

జంగారెడ్డిగూడెం : సంక్షేమ పథకాలు అందుకుంటున్న ప్రతి కుటుంబం ఆంధ్రప్రదేశ్‌కి శాశ్వత ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే కోరుకుంటున్నారని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారంతో 145వ రోజుకు చేరుకుంది. స్థానిక 7 వ వార్డులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎలీజాకు వార్డు కౌన్సిలర్ దిరిసిపాము ధనలక్ష్మి ఘన స్వాగతం పలికారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఎలీజా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందజేస్తున్నామని, అర్హత ఉండి ఇంకా ఎవరికైనా పథకాలు అందకుంటే వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అందచేసే సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంత వరకు మేలు చేశాయని బేరీజు వేసుకుని, ప్రజల సలహాలు, సూచనలు తీసుకుని రాబోయే సంవత్సరంలో మరింత ప్రజారంజకమైన పరిపాలన అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమం రూపొందించారని అన్నారు. ప్రజల ఇంటికి తాము వెళ్లినపుడు ఒకొక్క ఇంటికి పొందిన లబ్ధి చూస్తుంటే ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. మంగళవారం పర్యటించిన 7వ వార్డులో ఒక కుటుంబానికి రూ.18 లక్షల లబ్ధి చేకూరిందని తెలిపారు. తమ కుటుంబాలకు జరిగిన ఇంత అద్భుతమైన లబ్ధిని ఇన్ని సంవత్సరాల్లో ఎప్పుడూ చూడలేదని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ రాష్ట్రంలో ఎప్పటికీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డే ఉండాలని ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రజలను తన కన్నబిడ్డల్లా చూసుకుంటున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి చింతలపూడి నియోజకవర్గం తరఫున ఎమ్మెల్యే ఎలీజా కృతజ్ఞతలు తెలియచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్, వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పీపీఎస్ చంద్రరావు, ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా విభాగ అధ్యక్షురాలు వందనపు సాయిబాలపద్మ, పార్టీ జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అక్బర్, కౌన్సిలర్‌లు నేకూరి కిషోర్, ఉగ్గం దుర్గాప్రసాద్, సంకు సురేష్, తడికమళ్ళ మురళి కృష్ణ, దొంతు మాధవ్, బిలాల్ మసీదు అధ్యక్షుడు షేక్ జిలానీ, మండల సచివాలయాల కన్వీనర్ పంది రాజా, నాయకులు మేడవరపు విద్యాసాగర్, బత్తిన చిన్న, మండలపు సాయిబాబ, ముసునూరు వెంకటేశ్వరరావు, లిడ్‌క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, కేమిశెట్టి మల్లిబాబు, గూడపాటి రాధాకృష్ణ, కంచర్ల విష్ణు, సచివాలయ కన్వీనర్‌లు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

ఆంగ్ల మాధ్యమ విధానాన్ని వినియోగించుకోండి

ఏలూరు (టూటౌన్): చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశ పెట్టిన ఇంగ్లీషు మాధ్యమంలో చేర్పించాలని రాష్ట్ర చర్మకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాలిమేర హరికృష్ణ కోరారు. స్థానిక గన్‌బజార్, కబాడీగూడెం, శనివారపు పేటలలో చర్మకారులు, పేద సామాజిక వర్గాల వారు నివసించే ప్రాంతాల్లో పల్లె పయనం పేరుతో ఆయా సామాజిక వర్గాల వారికి అవగాహన కల్పించే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తయారు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు చర్మకారులు, ఆయా సామాజిక వర్గాల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చింతలపూడి అభివృద్ధికి చర్యలు



వీధి వ్యాపారులతో మాట్లాడుతున్న నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

చింతలపూడి : చింతలపూడి పట్టణ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు నూజివీడు సబ్ కలెక్టర్, నగర పంచాయతీ ప్రత్యేక అధికారి ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైనేజీలను పరిశీలించి డ్రెయిన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని నగర పంచాయతీ అధికారులను ఆదేశించారు. వీధి వ్యాపారులతో మాట్లాడారు. అనంతరం పట్టణ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పట్టణాన్ని స్వచ్ఛ చింతలపూడిగా మార్చడంతో పాటు పట్టణ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఎస్‌వీఎస్ కాలనీ సమీపంలోని లింగన్న కుంట చెరువును కొలతలు కొలిచి హద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట నగర పంచాయతీ కమిషనర్ ఎస్.రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం





బుట్టాయగూడెం మండలం అలివేరులో గాలివానకు ఒరిగిన చెట్లు, రెడ్డికుంకాల గ్రామంలో విరిగిపడిన విద్యుత్ స్తంభాలు →

బుట్టాయగూడెం : మన్యం ప్రాంతంలో మంగళవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ సుమారు 39 డిగ్రీల ఉష్ణోగ్రతతో తీవ్రంగా ఎండలు కాయడంతో ప్రజలు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే ఉన్నట్టుండి సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. కారుమబ్బులు కమ్మి వర్షం, ఈదురు గాలులు వేగంగా వీచాయి. అలివేరు, యర్రాయిగూడెం, రేగులపాటు, రేపల్లె, డోలుగండి, వీరమద్దిగూడెం, తదితర గ్రామాల్లో వర్షంతోపాటు తీవ్రమైన ఈదురుగాలులు వీచాయి. బొప్పాయి, అరటి, ఎర్రచందనం చెట్లు నేలకొరిగాయి. కాగా ఒక్కసారిగా వచ్చిన మార్పులతో వాతావరణం చల్లబడడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

పోలవరం రూరల్ : పోలవరం మండలం రెడ్డి కుంకాల గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం వీచిన ఈదురుగాలుల ప్రభావంతో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఒక్కసారిగా భారీగా ఈదురుగాలులు వీయడంతో గ్రామంలో 10 విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. దీంతో ఆ ప్రాంతానికి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. మంగళవారం రాత్రంతా చీకట్లోనే ఉండాల్సిన పరిస్థితి. ఈ విషయాన్ని ఎంపీటీసీ మిడియం సింగరాజు, కోటంబాబూరావు విద్యుత్ శాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. బుధవారం విద్యుత్ స్తంభాలు పునరుద్ధరించే పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాలంకరణ

కొయ్యలగూడెం : పొంగుటూరు గ్రామ దేవత శ్రీ గంగానమ్మ జాతర మహోత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల అలంకరణ ఆకట్టుకుంటోంది. కిలోమీటర్ మేర నలభై అడుగుల ఎత్తులో రోడ్డుకి ఇరువైపులా ఏర్పాటుచేసిన విద్యుత్ దీపాలంకరణతో పాటు గ్రామ ప్రవేశ ద్వారాలను నలువైపులా ఏర్పాటు చేసి భారీ విద్యుత్ లైటింగ్ కటౌట్లను నిర్మించారు. రూ.15 లక్షలతో విద్యుత్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేసినట్లు జాతర నిర్వాహకులు పేర్కొన్నారు. వీటికి తోడు జెయింట్ వీల్, ఎగ్జిబిషన్ స్టాల్‌ను చిన్నారులను అలరించే క్రీడా పార్కును మంగళవారం నుంచి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. కాగా అమ్మవారికి దైనందిక పూజాది కార్యక్రమాలు యథావిధిగా కొనసాగించారు. గురువారం రాత్రి 8 గంటలకు జబర్దస్త్ కామెడీ షో నిర్వహించనున్నారు.



పొంగుటూరు జాతరలో ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాలంకరణ

ఏరియా ఆసుపత్రి ఏర్పాటు చేయాలని వినతి

ఏలూరు (టూటౌన్): ఏలూరులో ఏరియా ఆసుపత్రిని వెంటనే ఏర్పాటు చేయాలని, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రద్దయిన వైద్యులు, వైద్య సిబ్బంది, బెడ్స్‌ను పునరుద్ధరించాలని అఖిల పక్ష పార్టీల నాయకులు కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, జనసేన, ఆమ్ ఆద్మీ తదితర పార్టీల నాయకులు మంగళవారం జిల్లా ప్రభుత్వాసుపత్రిని సందర్శించి, వైద్య కళాశాల పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా ఏలూరు, దెందులూరు, కైకలూరు నియోజకవర్గాల ప్రజలకు ఏలూరు జిల్లా ప్రభుత్వాసుపత్రి ప్రధాన ఆధారం అన్నారు. ఏలూరులో ఒక ద్వితీయ శ్రేణి ఆసుపత్రిని ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించాలని విజ్ఞప్తి చేసారు. అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి డీఆర్వో సత్యనారాయణ మూర్తికి వినతిపత్రం అందజేసారు.

అక్రమంగా పుల్లల తరలింపు



అటవీ ప్రాంతం నుంచి పుల్లను తరలిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్ : పోలవరం మండలం జెళ్ళెళ్ళగూడెం పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా పుల్లను తరలించేస్తున్నారు. మారుజాతి కలపను నరికి, ట్రాక్టర్‌లపై లోడ చేసి బ్యారన్ పుల్ల పేరుతో అక్రమ రవాణాదారులు కాసులు గడిస్తున్నారు. నిత్యం ఈ ట్రాక్టర్‌లపై కలప తరలిపోతున్నా అడ్డుకునే వారే లేరని విమర్శలు ఎదురవుతున్నాయి. అటవీ ప్రాంతంలోని మారు జాతి కలపను అక్రమ రవాణాదారులు నరికి పుల్లగా మార్చి తరలించుకుని పోతున్నారనే విషయాన్ని అటవీశాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా అడ్డుకట్ట పడలేదంటూ పలువురు చెబుతున్నారు. ఈ ప్రాంతం నుంచి వేరే మండలాలకు పుల్లను ట్రాక్టర్‌లపై తరలిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అటవీ శాఖాధికారులు స్పందించి అక్రమ పుల్ల రవాణాను అరికట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు పోలవరంలో వలంటీర్లకు వందనం

పోలవరం రూరల్ : పోలవరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బుగ్గా మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు వలంటీర్లను సత్కరిస్తారన్నారు.